క్లుప్తంగా

పకడ్బందీగా భద్రత ఏర్పాట్లు



సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ సుహాసన్

గుడిహత్నూర్: ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద నిఘా పెట్టారు. విజిలెన్స్ సీఐ సుహాసన్, ఎస్సై ఇమ్రాన్‌లు మండలానికి చేరిన బీఎస్‌ఎఫ్ భద్రతా సిబ్బందికి పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.

తుకారాంను ఆదర్శంగా తీసుకోవాలి



నివాళులర్పిస్తున్న ఎంపీపీ జైవంత్‌రావు

ఉట్నూర్‌రూరల్: మడావి తుకారాంను ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ జైవంత్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని ఎక్స్ రోడ్డు వద్ద తుకారాం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుకారాం ఆదివాసీలలో ఉన్నత చదువులు చదివి కలెక్టర్‌గా ఎదిగారని గుర్తుచేశారు. ఆదివాసీలు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్, సలాం శ్యాంరావు, మంగం విషంరావు, ఓమేశ్, మెస్రం ఆనంద్‌రావు, అర్క గంగారాం, పర్చకి తెలంగ్‌రావు, తొడసం జనార్దన్, అర్క సెడ్మరావు, జల్పత్‌రావు, భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష చూపొద్దు



అవగాహన కల్పిస్తున్న సరస్వతి

ఎదులాపురం: తల్లిదండ్రులు పిల్లల విషయంలో లింగ వివక్షత చూపించొద్దని సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ సరస్వతి అన్నారు. స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా ఈనెల 25 నుంచి డిసెంబర్ 10 అంతర్జాతీయ ప్రచారోద్యమం కార్యకమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పట్టణంలోని బొక్కలగూడలోని మగ్గం వర్క్ శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులు, బంగారిగూడ మైనార్టీ హాస్టల్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ లింగ వివక్షతను నిర్మూలనకు కృషి చేయాలన్నారు. పోక్సో చట్టం, బాల్య వివాహ చట్టం, గృహహింస చట్టం, సైబర్‌నేరాల గురించి వివరించారు. సఖీ కేంద్రం సిబ్బంది కేసే వర్కర్ నాగమణి, పారామెడికల్ వర్కర్ సుకేష, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో తనిఖీలు

ఖానాపూర్: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బాదన్‌కుర్తి గ్రామంలోని జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులో బుధవారం అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు, మద్యం, ఇతర వస్తువులు తీసుకెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నిఘా కట్టుదిట్టం..

- జిల్లా వ్యాప్తంగా 80 సమస్యాత్మక కేంద్రాలు
- బీఎస్‌ఎఫ్ బలగాలతో ప్రత్యేక బందోబస్తు
- ఎన్నికల విధుల్లో 2,400 మంది పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల కోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. నిఘా నీడలో పోలింగ్‌కు సన్నద్ధమయ్యారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా అంతటా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగానే వాటిని పసిగట్టేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్‌ను కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు అనుసంధానం చేశారు. వీటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు.

భారీ బందోబస్తు..

జిల్లాలో 592 పోలింగ్ కేంద్రాల్లో గురువారం పోలింగ్ కొనసాగనుంది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 290, బోథ్ నియోజకవర్గంలో 302 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ల వద్ద బందోబస్తు కోసం 2,400 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. ఇందులో 8 కంపెనీల బీఎస్‌ఎఫ్ బలగాలు, మహారాష్ట్రకు చెందిన 550 మంది హోంగార్డులు, జిల్లాకు చెందిన సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులకు ఎన్నికల విధులు కేటాయించారు. 84 మొబైల్ రూట్లను ఏర్పాటు చేశారు. 3 స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలకు గాను 30 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. అలాగే రెండు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ సమక్షంలో 20 మందితో రిజర్వు బృందాన్ని అందుబాటులో ఉంచారు. ఎస్పీ పర్యవేక్షణలో జరిగే బందోబస్తుకు అడిషనల్ ఎస్పీతో పాటు ఐదుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 50 మంది వరకు ఎస్సైలతో ఈ బందోబస్తు చేపడుతున్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

నిఘా నీడలో..

జిల్లాలో ఇప్పటికే అక్రమ మద్యంతో పాటు డబ్బును తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేశారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ.1 కోట్ల 61లక్షల 34వేల 250 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రూ.24లక్షల 38వేల 867 విలువ గల 4,075 లీటర్ల మద్యం సీజ్ చేశారు. 400 మందిపై కేసులు నమోదయ్యాయి. 307 బెల్టుషాపులను మూసివేయించారు. రూ.20లక్షల 48వేల విలువ చేసే 80 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయికి సంబంధించి 8 కేసులు నమోదు చేయగా, 13 మందిని అరెస్టు చేశారు. 1394 మందిని బైండోవర్ చేసి 863 కేసులు నమోదు చేశారు. 24 గంటల పాటు పర్యవేక్షణ కొనసాగుతోంది. ఇప్పటివకే జిల్లాలో పది చెక్‌పోస్టులు ఏర్పాటు చేయగా, వీటిలో 7 అంతర్రాష్ట్ర, 3 అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. 10 పెట్రోలింగ్ బృందాలతో తనిఖీలు కొనసాగుతున్నాయి. మద్యం, డబ్బు పంచకుండా పది బృందాలను ఏర్పాటు చేశారు. సీఐ, ఎస్సై స్థాయి అధికారులతో పర్యవేక్షిస్తున్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై ఫోకస్..

జిల్లా వ్యాప్తంగా 80 సమస్యాత్మక, 20 మావోయిస్టు ప్రభావిత కేంద్రాలను గుర్తించినట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈ కేంద్రాల వద్ద బీఎస్‌ఎఫ్ బలగాలతో ఆఫ్ సెక్షన్ బందోబస్తు చేపడుతున్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారు.

భారీ బందోబస్తు ఏర్పాటు



ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు వేసే అవకాశం ఉంది. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురి కంటే ఎక్కువ మంది ఉండరాదు. కేంద్రాల వద్ద ఎలాంటి పోలింగ్ చీటీలు పంచరాదు. నార్నూర్, గాదిగూడ మండలాల్లోని సమస్యాత్మక కేంద్రాల్లో మాత్రం సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగియనుంది. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు స్థానికంగా ఉండరాదు. డబ్బు, మద్యం, ఇతర వాటితో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వారిపై చర్యలు తప్పవు. ఇలాంటివి జరిగితే ప్రజలు డయల్ 100కు సమాచారం అందించాలి.

– డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ

ఎన్నికలకు సర్వం సిద్ధం

- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభం

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లో అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. మండలంలోని వివిధ గ్రామాల్లో 17 పోలింగ్ కేంద్రాలు, భీంపూర్ మండలంలోని 28 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది సామగ్రితో చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా వసతులు ఏర్పాటు చేశారు.

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ నియోజకవర్గంలో ఖానాపూర్ రిటర్నింగ్ అధికారి జీవాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని కేబీ ప్రాంగణంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాల ప్రాంగణంలో సామగ్రిని సిద్ధం చేశారు. నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఒకొక్క పోలింగ్ కేంద్రంలో పీవో, ఏపీవో, పోలింగ్ అధికారి, పోలింగేతర సిబ్బంది మొత్తం ఐదుగురు ఉంటారు. ఆయారూట్లలో ప్రత్యేకంగా సెక్టార్ అధికారులను నియమించారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో దాదాపు 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు.



గుడిహత్నూర్: బస్సు దిగుతున్న సిబ్బంది



ఇంద్రవెల్లి: పోలింగ్ కేంద్రానికి చేరిన అధికారులు

ఇంద్రవెల్లి: అధికారులు, పోలీస్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం 48 పోలింగ్‌బూత్‌లను కేంద్రాలు ఏర్పాటు చేయగా.. నాలుగు రూట్‌లుగా విభజించి, సిబ్బందిని నియమించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

గుడిహత్నూర్: శాసనసభ ఎన్నికలకు మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తహసీల్దార్ కవితారెడ్డి తెలిపారు. మండలంలో 36 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. మొత్తం 24,378 మంది ఓటర్లు ఓటు వేయడానికి ఏర్పాట్లు చేశారు. వీరిలో 11987 పురుష ఓటర్లు, 12392 మహిళా ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. 36 పోలింగ్ కేంద్రాలను నాలుగు రూట్లుగా విభజించి ప్రత్యేకాధికారులను నియమించారు.

నేరడిగొండ: మండలంలో మొత్తం 35 పోలింగ్ కేంద్రాలున్నాయి. మొత్తం ఓటర్లు 23,102 మంది ఉన్నారు. అయితే ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు ఓటుహక్కు వినియోగించుకునేలా సర్వం సిద్ధం చేశారు.



తాంసి: పోలింగ్ కేంద్రానికి వస్తున్న సిబ్బంది



ఉట్నూర్‌రూరల్: విధులకు వెళ్తున్న సిబ్బంది



నేరడిగొండ: వడూర్‌కు చేరుకున్న అధికారులు

ఇరుకు గదుల్లో పోలింగ్ బూత్‌లు

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలతో ఓటర్లు, సిబ్బందికి ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉంది. పోలింగ్ బూత్ నెం.102లో 1047 ఓటర్లు, బూత్ నెం.103లో 1034 ఓటర్లు, బూత్ నెం.104లో 889 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. అయితే ఈ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడమే కాకుండా ఇరుకైన గదులు ఉన్నాయి. ఓటర్ల క్యూకు కనీసం స్థలం కూడా లేదు. ఒకేసారి వంద మంది ఓటర్లు వస్తే కిక్కిరిసి పోతుంది. వచ్చి వెళ్లేందుకు చిన్న దారి మాత్రమే ఉంది. దీంతో ఇక్కట్లు తప్పేలా లేవు. విశాలమైన ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నప్పటికీ అధికారులు గుర్తించక పోవడంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



చిన్న భవనంలోనే ఏర్పాటు చేసిన మూడు పోలింగ్‌బూత్‌లు

ఎవరి మదిలో ఏముందో?



- అంతుచిక్కని ఓటరు నాడి
- అభ్యర్థులో టెన్షన్.. టెన్షన్
- ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటున్న అభ్యర్థులు

బోథ్: అసెంబ్లీ ఎన్నికల్లో కీలక ఘట్టం మొదలైంది. గురువారం పోలింగ్ జరగనుంది. అభ్యర్థుల తలరాతలను మార్చే రోజు ఆసన్నమైంది. గత నెల రోజులుగా ఆయా పార్టీల అభ్యర్థులు క్షణం తీరికలేకుండా ప్రచారం చేశారు. కోట్లు ఖర్చు చేశారు. అయినా గెలుపు తీరాలు దాటాలంటే ఓటర్లు ఎన్నికల రోజు వేసిన ఓటే కీలకం. ఆ రోజు రానే వచ్చింది. అయితే ఓటరు మదిలో ఏముందో మాత్రం అభ్యర్థికి తెలియని పరిస్థితి నెలకొంది. సర్వే సంస్థలకు సైతం అంతుచిక్కని అంశంగా మారింది. దీంతో అభ్యర్థులు టెన్షన్‌కు లోనవుతున్నారు. ఆయా గ్రామాల్లోని నాయకులతో నిరంతరం ఫోన్‌లో మాట్లాడుతున్నారు. పరిస్థితిని తెలుసుకుంటున్నారు.

మీ పార్టీకే వేస్తాం..

ఏ ఎన్నికల్లోనైనా ప్రచారం చివర్లో ఓటర్లు ఏ పార్టీవైపు ఉన్నారో అభ్యర్థులు కొంత బేరీజు వేసుకుంటారు. పార్టీ బలహీనంగా ఉన్న చోట ఎక్కువగా తిరుగుతూ పలు ప్రయత్నాలు, తాయిలాల ద్వారా మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఈ ఎన్నికల్లో ఏ ఓటరును అడిగినా మీ పార్టీకే ఓటు వేస్తాంటూ చెబుతుండడంతో అభ్యర్థుల్లో కొత్త టెన్షన్ మొదలైంది. ఓటరు గుటు విప్పకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన కనిపిస్తోంది. ఈనెల 28 సాయంత్రం 5 గంటలకు ప్రచారం నిలిచిపోయింది. 28, 29వ తేదీల్లో ఆయా పార్టీల నాయకులు గ్రామాల్లో తిరుగుతూ నోటి మాట ద్వారా ప్రచారం చేశారు. పలు పార్టీలు కులాల వారీగా, కాలనీల వారీగా, గ్రామాల వారీగా తాయిలాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

గ్రామాల్లోకి నాయకులు పరుగులు..

ఎంత ప్రచారం చేసినా.. గెలుస్తామని ధీమాగా ఉన్నా.. ఎన్నికల చివరి రోజు అభ్యర్థుల్లో ఆందోళన ఉంటుంది. దీంతో అభ్యర్థులు నిద్రాహారాలు మాని, నాయకులకు, కార్యకర్తలకు ఫోన్లు చేస్తూ బిజీగా ఉంటున్నారు. గ్రామాల్లోకి వెళ్లి గ్రామస్తులను కలవాలని అభ్యర్థులు నాయకులతో పేర్కొంటున్నారు. గ్రామాల్లో తమకున్న ఓటు బ్యాంకును కాపాడుకోవాలని సూచిస్తున్నారు.

యువత, మహిళల ఓట్లే కీలకం..

బోథ్ నియోజకవర్గంలో 208048 ఓటర్లు ఉన్నారు. ఇందులో 18 నుంచి 39 ఏళ్ల వారు 1,19,784 ఓటర్లు ఉన్నారు. వీరంతా యువకులు, మధ్య వయస్కుల వారే. సామాజిక మాధ్యమాలు, సమాజంలో జరుగుతున్న విషయాలు, పార్టీలు, అభ్యర్థులపై అవగాహన కలిగి ఉంటారు. ఓటర్లలో వీరు 57.57 శాతం ఉన్నారు. ప్రస్తుతం వీరే గెలుపోటములను ప్రభావితం చేయనున్నారు. దీంతో అభ్యర్థులు యువతపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టి, ప్రచారం చేశారు. ఇక మహిళలు 106764, పురుషులు 101281 ఉన్నారు. పురుషుల కన్నా మహిళల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. మహిళలు అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేయనున్నారు.

ఎన్నికల సందడి



ఈవీఎం, వీవీప్యాడ్లను పరిశీలిస్తున్న అధికారులు



ఎన్నికల సామగ్రి తీసుకునేందుకు చిన్నారితో వచ్చిన అధికారి

జిల్లా వ్యాప్తంగా ఎన్నికల సందడి నెలకొంది. గురువారం అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున ఆదిలాబాద్ పట్టణంలోని టీటీడీసీలో అధికారులు సిబ్బందికి ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. సిబ్బంది వాటిని సరిచూసుకున్నారు. వారికి కేటాయించిన పోలింగ్‌బూత్‌లకు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న తరువాత సిబ్బంది అన్నిఏర్పాట్లు చేసుకున్నారు.



సామగ్రిని సరిచేసుకుంటున్న సిబ్బంది



బస్‌లో తరలివెళ్తున్న ఎన్నికల సిబ్బంది

ఏజెన్సీ గజగజ

రోజురోజుకూ చలితీవ్రత పెరుగుతోంది. దీంతో ఏజెన్సీవాసులు గజగజ వణుకుతున్నారు. జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఉదయం నుంచి రాత్రి వరకు చలి గాలులు వీస్తున్నాయి. ఉదయం పొగమంచు కారణంగా ప్రజలు ఏ పనులు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ప్రజలు ఇంటి నుంచి బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు. రహదారులపై పొగమంచు కమ్ముకోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

– ఉట్నూర్‌రూరల్



